AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
1-7-2026 (Wednesday) MAIN EDITION

## దిగ్గజ నటి విజయ మెహతా కన్నుమూత




**అక్షరటుడే, ముంబై:** భారతీయ సినీ, నాటక రంగాలు ఒక గొప్ప దిగ్గజ కళాకారిణిని కోల్పోయి శోకసంద్రంలో మునిగిపోయాయి. ప్రఖ్యాత నటి, దర్శకురాలు విజయ మెహతా (89) మంగళవారం రాత్రి ముంబైలోని తన నివాసంలో వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచారు. మరాఠీ నాటకరంగంలో సరికొత్త ప్రయోగాలు చేసిన ఆమె మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. విజయ మెహతా మరణం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతీయ ప్రదర్శన కళా రంగానికి ఆమె చేసిన కృషి మరువలేనిదని ప్రధాని కొనియాడారు.

## బోరుబావిలో పడిన నాలుగేళ్ల చిన్నారి మృతి

**అక్షరటుడే, హర్యానా:** హర్యానా రాష్ట్రం అంబాలా జిల్లాలోని ధనౌరా గ్రామంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయిన నాలుగేళ్ల బాలుడు నిర్వైర్ సింగ్, ప్రాణాలు కోల్పోయాడు. మంగళవారం ఉదయం బాలుడు పొలంలో ఆడుకుంటుండగా.. అనుకోకుండా 220 అడుగుల లోతైన పాత బోరుబావిలో పడిపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి భారీ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. దాదాపు 21 గంటల పాటు శ్రమించిన రెస్క్యూ బృందాలు, బుధవారం తెల్లవారుజామున బాలుడిని బయటకు తీశారు. అయితే, అప్పటికే బాలుడు మరణించడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది.

## జైల్లో పెట్టారనే కోపం లేదు: చంద్రబాబు



అక్షరటుడే, ఏపీ : తనను జైలులో పెట్టారనే కోపం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తాను జైల్లో పెట్టాలను కుంటే నిమిషం చాలన్నారు. సాయికృష్ణ కేసులో పవన్‌ను విమర్శించారని, కుల రాజకీయాలు చేయా లని చూశారని మండిపడ్డారు. బ్లేడ్ బ్యాచ్‌లు, రౌడీలకు వైసీపీ మద్దతిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## టీవీకే ఎమ్మెల్యేకు బెదిరింపులు



అక్షరటుడే, చెన్నై: టీవీకే ఎమ్మెల్యే ఇళయరాజాను పలువురు బెదించారు. స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే రూ.35 కోట్లు ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చారు. ఐపీడీఎస్ ప్రతినిధిగా చెప్పకుంటూ తిరునావుక్కరసు అనే వ్యక్తి ఫోన్ చేశాడు. అయితే ఆ ఆఫర్‌కు ఎమ్మెల్యే నిరాకరించడంతో ఆయన కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించాడు.

## సక్సెస్‌కు షార్ట్‌కట్ లేదు: కవిత



అక్షరటుడే, హైదరాబాద్: సక్సెస్‌కు షార్ట్ కట్ లేదని, హార్డ్ వర్క్ ద్వారానే సక్సెస్ అవుతామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మెహదీపట్నంలోని కింగ్స్ ప్యాలెస్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో ఆమె పాల్గొన్నారు. దాదాపు 150 కంపెనీలతో 2 వేల ఉద్యోగాలిచ్చే ఉద్దేశంతో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేయడాన్ని కవిత అభినందించారు.

## హైదరాబాద్‌లో కాల్పుల కలకలం..

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో మంగళవారం అర్ధరాత్రి కాల్పులు కలకలం రేపాయి. మోస్ట్ వాంటెడ్ నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. నల్గొండ జిల్లాలో చోరీలకు పాల్పడిన నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో నల్గొండ సీసీఎస్ పోలీసులు అతడిని పట్టుకునేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఈ క్రమంలో ఆదిభట్ల వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకోవడానికి యత్నించారు. పోలీసులను చూసిన నిందితుడు భూష్మి శ్రీకాంత్ వారిపై కత్తితో దాడి చేసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు అప్రమత్తమై అతడి కాళ్లపై కాల్పులు జరిపారు. స్వల్ప గాయాలైన శ్రీకాంత్‌ను వనస్థలిపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ఇండిగో కొత్త ప్లాన్..

**అక్షరటుడే, ఢిల్లీ:** తక్కువ లగేజీతో ప్రయాణించే ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో, ఇండిగో సంస్థ 'ఇండిగో లైట్' రాయితీ ఛార్జీల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ కొత్త ప్లాన్ ద్వారా, ప్రయాణికులు తమకు అవసరమైన సేవలకు మాత్రమే డబ్బులు చెల్లించే అవకాశం ఉంటుంది. సాధారణంగా విమాన ప్రయాణాల్లో లగేజీ ఛార్జీలు టికెట్ ధరలో కలిసి ఉంటాయి. కానీ, ఈ కొత్త విధానంలో చెక్‌ఇన్ బ్యాగేజీ అవసరం లేని వారు, కేవలం క్యాబిన్ బ్యాగ్‌తో మాత్రమే ప్రయాణించే వారు తక్కువ ధరకే టికెట్లను బుక్ చేసుకోవచ్చు. దీనివల్ల ప్రయాణికులు తమ ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ కొత్త ఆఫర్ బుకింగ్‌లు జులై 1, 2026 నుంచి అందుబాటులోకి వచ్చాయి. జులై 15, 2026 నుంచి జరిగే ప్రయాణాలకు ఈ రాయితీ వర్తిస్తుంది.

## రూ.50 కోట్లతో పరారైన వ్యాపారవేత్త

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** రూ.50 కోట్లు అప్పు చేసి పరారు అయ్యాడో వ్యాపారి. ఈ ఘటన హైదరాబాద్ నగరంలో చోటు చేసుకుంది. ఆధిక వడ్డీలు ఇస్తానని ఆశచూపి డబ్బులు తీసుకున్న సిమెంట్ వ్యాపారి పారిపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. నగరంలోని కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చక్రపురం, భగవాన్ కాలనీకి చెందిన పబ్బ చంద్రశేఖర్ శ్రీవెంకటేశ్వర మార్కెటింగ్ పేరుతో సిమెంట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన 30 ఏళ్లుగా ఇక్కడ ఉండటంతో చాలా మందితో పరిచయమైంది. చంద్రశేఖర్ చిట్టీలు సైతం వేసేవాడు. వ్యక్తిగత, వ్యాపారపరమైన అత్యవసర అవసరాల పేరుతో సుమారు 60 మంది నుంచి రూ.50 కోట్లకు పైగా డబ్బు తీసుకున్నాడు. అయితే ఆయన జూన్ 22 నుండి తన భార్యతో సహా అదృశ్యమయ్యాడు.



# సీఎం ఒంటెద్దు పోకడలు

**కాంగ్రెస్‌లో మరోసారి అసమ్మతి రేగింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సీఎం ఒంటెత్తు పోకడలు అసలు బాగా లేవన్నారు. ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు కనుమరుగు అవుతున్నారని, కొత్తగా చేరిన వారి హవా నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో షో ఆప్స్ ఎక్కువ అయ్యాయని సంచలన వ్యాఖ్యలు చేశారు.**

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- ప్రభుత్వంలో షో ఆఫ్స్ ఎక్కువ
- పార్టీలో కొత్తవాళ్ల హవా
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం యాదగురిగుట్ట దేవస్థాన ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. యాదాద్రి జిల్లాలోనే తన నియోజకవర్గంలో ఉన్నా.. తనకు కనీస సమాచారం ఇవ్వకుండా బోర్డును ఏర్పాటు చేశారని రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు సమాచారం ఇచ్చి ఉంటే నియోజకవర్గానికి చెందిన ఒకరినైనా బోర్డులో చేర్చించేవాడినని తెలిపారు. సీఎం ఏకపక్ష పోకడలు తనకు నచ్చడం లేదన్నారు. ఆయన వ్యవహారశైలి నచ్చకనే నల్గొండ సభకు వెళ్లలేదని స్పష్టం చేశారు.

### వాళ్లదే నడుస్తుంది

రేవంత్ రెడ్డి వ్యవహారశైలి బాగోలేదని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. సీఎం తీరు నచ్చకపోయినా.. ఆయనతో టచ్‌లో ఉంటున్నానని తెలిపారు. ఇటీవల రాహుల్‌గాంధీని సైతం కలిశానన్నారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని తెలిపారు. తమకు కూడా యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డులో అవకాశం కల్పించి ఉంటే బాగుండేదని అన్నారు. పార్టీలో ఒరిజినల్ కాంగ్రెసోళ్లు ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన కొత్తవాళ్లది నడుస్తుందన్నారు.

### సొంత పార్టీపైనే..

రాజగోపాల్ రెడ్డి సొంత పార్టీపైనే విమర్శలు చేస్తున్నారు. ఆయన మంత్రి పదవి ఆశించారు. అయితే అధిష్టానం అవకాశం ఇవ్వలేదు. దీంతో గతంలో సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా విమర్శలు చేశారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అయితే కొంతకాలంగా రాజగోపాల్‌రెడ్డి మౌనంగా ఉంటున్నారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట దేవస్థాన బోర్డు ఏర్పాటుతో మరోసారి సీఎంపై విమర్శలు చేశారు. ఇటీవల నల్గొండలో జరిగిన సభకు సైతం రాజగోపాల్‌రెడ్డి హాజరు కాలేదు. దీంతో మరోసారి పార్టీకి ఆయనకు మధ్య గ్యాప్ పెరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం: జగన్



**అక్షరటుడే, అమరావతి:** ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. తాడెపల్లిగూడెంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సాయికృష్ణ లాకప్ డెత్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తమ హయాంలో సంక్షేమం గురించి చర్చ జరిగిందని జగన్ అన్నారు. చంద్రబాబు పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం, కస్టోడియల్ డెత్ మీద చర్చ జరుగుతోందని విమర్శించారు. రూల్ ఆఫ్ లా పక్కకుపోయి.. రూల్ ఆఫ్ ఫియర్ రాజ్యమేలుతోందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## రాఘవ్ చద్దా కేసులో హైకోర్టు కీలక నిర్ణయం



**అక్షరటుడే, ఢిల్లీ:** రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దాకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, ఆయనకు వ్యతిరేకంగా ఉన్న ఐదు అభ్యంతరకర పోస్టులను వెంటనే తొలగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీలోకి మారిన ఎంపీ రాఘవ్ చద్దా, రాజకీయ కారణాల వల్ల తనపై కొన్ని వర్గాలు దుష్ప్రచారం చేస్తున్నాయని కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఘాటుగా స్పందించింది. రాజకీయ విమర్శలు చేయడం వేరు, వ్యక్తిగత దూషణలకు దిగడం వేరని కోర్టు అభిప్రాయపడింది.

## భారీగా తగ్గిన వాణిజ్య సిలిండర్ ధరలు



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశంలోని వ్యాపార వర్గాలకు, విమానయాన రంగానికి కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కలిసి శుభవార్త అందించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల స్థిరీకరణ , భౌగోళిక రాజకీయ పరిస్థితులు మెరుగుపడటంతో ఇంధన ధరలను సవరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొత్త ధరలు తక్షణమే అమలులోకి వచ్చాయి. వ్యాపార వినియోగదారులకు ఊరటనిస్తూ, 19 కేజీల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరపై రూ. 183.50 తగ్గింపును ప్రకటించారు. ఈ తాజా ధరల తగ్గింపుతో ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ. 2,930కి తగ్గింది. అలాగే, చిన్న వ్యాపారులకు ఉపయోగపడే 5 కేజీల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ. 13 తగ్గించారు. ఇళ్లలో వాడే 14.2 కేజీల సిలిండర్ల ధరలను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా.. తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న విమానయాన రంగానికి కూడా ధరల తగ్గింపు మేలు చేయనుంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరను లీటరుకు రూ. 5 మేర తగ్గించారు.

## పాక్‌పై అఫ్గానిస్థాన్ వైమానిక దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇటీవల అఫ్గాన్‌పై పాక్ దాడి చేయగా.. తాజాగా ఆ దేశం ఎదురుదాడులకు దిగింది. ఆఫ్గానిస్థాన్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న తాలిబన్ ప్రభుత్వం, పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి భారీ వైమానిక, డ్రోన్ దాడులు నిర్వహించింది. పాక్‌లోని బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్సులలో ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్‌కు చెందిన ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాలిబన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. వైమానిక దాడులు అత్యంత కచ్చితత్వంతో జరిగాయని, ఐసిస్‌కె ఉగ్రవాదులకు భారీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం కలిగించాయని అఫ్గాన్ తెలిపింది.

## రెండు లారీలు ఢీ.. నలుగురు సజీవదహనం



**అక్షరటుడే, ఏపీ :** ఏపీలోని పల్నాడు జిల్లా బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో నలుగురు సజీవదహనం అయ్యారు. బోయపాలెం గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు బుధవారం తెల్లవారుజామున ఎదురెదురుగా ఢీకొని మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు మరణించారు. చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వస్తున్న ఒక లారీ, సెంట్రల్ డివైడర్‌ను దాటి, ఎదురుగా చిలకలూరిపేట వైపు వస్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ఘటనతో భారీ మంటలు చెలరేగి, నిమిషాల వ్యవధిలోనే రెండు వాహనాలూ పూర్తిగా వ్యాపించాయి. వాటిలోని డ్రైవర్లు, క్లీనర్లు సజీవ దహనమయ్యారు.



## సమంత బేబీ బంప్ ఫొటో వైరల్..

**నటి సమంత తల్లి కాబోతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె తన బేబీ బంప్ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. నా సిక్స్ ప్యాక్.. మళ్లీ కలిసే వరకు అని క్యాప్షన్ ఇచ్చి ఆమె తన బేబీ బంప్ ఫొటోను పంచుకున్నారు. ఈ చిత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సమంత, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరును 2025 డిసెంబర్ 1న వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.**

– అక్షరటుడే, సినిమా డెస్క్